

# కామ్రేడ్ పి.కె.మూర్తికి విప్లవ జోహార్లు!

**కామ్రేడ్** పి.కె.మూర్తి మార్చి 22వ తేదీన పుదుచ్చేరి ఆస్పత్రిలో అమరులయ్యారన్న విషాదవార్త తెలిసింది. 80 సంవత్సరాల వయస్సులో వున్న కామ్రేడ్ పి.కె.మూర్తి 2 సం॥లుగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ తుదిశ్వాస విడిచారు.

కామ్రేడ్ పి.కె.మూర్తి చిన్నతనంలో బ్రాహ్మణిజానికి వ్యతిరేకంగా పెరియార్ నాయకత్వంలో సాగిన కులవ్యతిరేక ఆత్మగౌరవ ఉద్యమంతో ప్రభావితుడయ్యారు. 1962లో ఇంజనీరింగ్ విద్యను పారిస్‌లో అభ్యసించారు. 1968 మేలో ఫ్రెంచి విద్యార్థుల తిరుగుబాటు జరిగింది. ఆ తిరుగుబాటు ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఆ క్రమంలోనే మార్క్సిస్టుగా మారారు. 1967లో భారత విప్లవ రాజకీయాల్లో వచ్చిన పరిణామాలతో భారతదేశానికి తిరిగి వచ్చారు. 1967లో భారతదేశానికి తిరిగి వచ్చిన కామ్రేడ్ పి.కె.మూర్తి అర్థవలస, అర్థభూస్వామ్య వ్యవస్థకు నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేసే రాజకీయ కర్తవ్యంలో భాగస్వామ్యం అయ్యారు. కార్మికవర్గాన్ని విప్లవ రాజకీయాల్లో సమీకరించడానికి ఎనలేని కృషి చేశారు. బొగ్గు గని కార్మికుడిగా చింధ్వారా(మధ్యప్రదేశ్)లో చేరి కార్మికులను యూనియన్‌లోకి సమీకరించారు. విప్లవ కార్మిక సంస్థలకు ఆలిండియా నాయకుడిగా బాధ్యత వహించారు.

1989లో కార్మిక సంఘాల ఐక్యకార్యాచరణలో భాగంగా కామ్రేడ్ పి.కె.మూర్తితో మాకు సంబంధాలు ఏర్పడ్డాయి. 1992లో సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి ఏర్పాటు, ఆ తర్వాత సిపిఐ(ఎం-ఎల్) - జనశక్తి సిఒసి మెంబర్‌గా చురుకైన పాత్ర నిర్వహించాడు. గోద్రా సంఘటనల సందర్భంగా అహ్మదాబాద్‌లో నిరసన సదస్సు కోసం కామ్రేడ్ పి.కె.మూర్తి విశేష స్పందనతో కృషి చేశారు. యూనిటీ ఇనిషియేటివ్‌తో ఐక్యత, సిఒఐ(ఎం-ఎల్)తో ఐక్యత, కెఎన్ఆర్ గ్రూపుల ఐక్యతా క్రమంలో కామ్రేడ్ పి.కె.మూర్తి కృషి గమనంలో ఉంచుకోదగినది. 2003లో హైదరాబాద్‌లో జరిగిన ఆసియా సోషల్ ఫోరం నిర్వాహకులలో ఒకరుగా, వరల్డ్ సోషల్‌ఫోరంకు సౌత్‌ఇండియా ఛాప్టర్ బాధ్యుడుగా ముంబైలో జరిగిన వరల్డ్ సోషల్ ఫోరం నిర్వాహక బృందాలలో ఒకడుగా, ఫ్రాన్స్‌లో జరిగిన వరల్డ్ సోషల్ ఫోరంకు ప్రతినిధిగా, “మరో ప్రపంచం నిర్మించబడుతుంది” అనే సందేశాన్ని తీసుకెళ్ళారు. ఫ్రెంచ్ ప్రభుత్వం అవార్డు ఇచ్చి కామ్రేడ్ మూర్తిని గౌరవించింది. కామ్రేడ్ కానూసన్యాల్ జనరల్ సెక్రెటరీగా వున్న సిపిఐ(ఎం-ఎల్) సెంట్రల్ కమిటీ అవార్డు తీసుకోవడం సరికాదని అభిశంచింది. ఆ తర్వాత కామ్రేడ్ మూర్తి సెంట్రల్ కమిటీ సమావేశాలకు హాజరు కాలేకపోయారు. మనసు గాయపడి ఉండవచ్చు. ఫోన్ కాంటాక్టుకు కూడా దొరకలేదు. 2009లో హైదరాబాద్‌లో అందుబాటులో వున్న కామ్రేడ్స్ అందరినీ కలిసి సంతోషపడ్డారు. తిరిగి క్యాన్సర్ బారినపడిన తర్వాత ఫోన్ కాంటాక్టులోకి వచ్చారు. 2019 జూలై నెలలో పుదుచ్చేరిలో కామ్రేడ్ మూర్తిని చూశాము. ఆ స్థితిలో కూడా కామ్రేడ్ మూర్తి స్నేహపాత్రత, చూపిన వాత్సల్యం కళ్లముందు కదలాడుతూనే ఉంది. మా సెంట్రల్ కమిటీ సభ్యులందరినీ పేరుపేరునా అడగటంతో పాటు ప్రస్తుత రాజకీయాలు, విప్లవోద్యమ ఐక్యత సమస్యలు కూడా ప్రస్తావించుకున్నాం.

మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానానికి కట్టుబడిన కామ్రేడ్ మూర్తి అతివాద దుందుడుకు వాదాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. శ్రమజీవులలో సమైక్యమయ్యారు. శ్రమజీవుల సంఘాలను నిర్మించి, పోరాటాలను నిర్వహించారు. కామ్రేడ్ మూర్తికి కామ్రేడ్స్‌పై ప్రేమ ఎక్కువే, సరిగ్గా లేనిచోట కోపమూ ఎక్కువే. కామ్రేడ్ ప్రదీప్ రాసిన ‘ఒక కామ్రేడ్ బతుకు పుస్తకం’ ద్వారా మూర్తి గురించి కొన్ని కొత్త విశేషాలు తెలుసుకున్నాను.

అయితే మూర్తి ఆందోళనతత్వం, సూటి తత్వం ఆదర్శవంతమైనవే. మార్క్సిజం అజేయమన్న మూర్తి వ్యాసం తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ప్రచురించిన సంపుటాలలో తిరిగి ప్రచురించాం. మార్క్సిజం పట్ల తిరుగులేని విశ్వాసం గల మూర్తి నిర్మాణ పరంగా నిలకడైన పద్ధతులను, డెమోక్రటిక్ సెంట్రలిజానికి కట్టుబడి వ్యవహరించ లేకపోయారు. అదే కామ్రేడ్ మూర్తికి వున్న పరిమితి. ఆ పరిమితిని అధిగమించి ఉంటే, ఆయన శక్తియుక్తులు, కఠినమైన శ్రమ చేసే తత్వం సరైన విప్లవ పార్టీ నిర్మాణానికి దోహదపడి వుండేవి. కామ్రేడ్ మూర్తి నుంచి సానుకూలమైన అనుభవాలు, అననుకూలమైన అనుభవాలు మనకి తోడ్పడతాయి. కామ్రేడ్ మూర్తికి సిపిఐ(ఎం-ఎల్) సెంట్రల్ కమిటీ జోహార్లర్పిస్తున్నది. కామ్రేడ్ పి.కె.మూర్తి మరణం కమ్యూనిస్టు విప్లవకారులకు తీరని నష్టం.

**విశ్వం,** ప్రధానకార్యదర్శి
సిపిఐ(ఎం-ఎల్)